క్లుప్తంగా

గుర్రప్పస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్సీ



గుర్రప్పస్వామి పొంగళ్లు కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్సీ సిపాయి

ఏర్పేడు: మండలంలోని పాతవీరాపురం గ్రామస్తులు సోమవారం గుర్రప్ప స్వామికి సామూహికంగా పొంగళ్లు పెట్టారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. ఆయనను స్థానికులు పూలమాల, శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మునిరత్నంరెడ్డి, కొంగర దాము, రవి, మునస్వామిరెడ్డి పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ

కేవీబీపురం: మండలంలోని కళత్తూరు, కళత్తూరు దళితవాడ, సదాశివపురంలోని అంగన్‌వాడీ కేంద్రాలను సీడీపీఓ సౌభాగ్యమ్మ సోమవారం తనిఖీ చేశారు. పిల్లలకు అందిస్తున్న ఆహార పదార్థాల నాణ్యతను ఆరాతీశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ మూర్తి కల్పలతా పాల్గొన్నారు.

డప్పు కళాకారుల ఆందోళన

బుచ్చినాయుడుకండ్రిగ: సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ డప్పు కళాకారులు సోమవారం బీఎన్‌కండ్రిగ మెయిన్‌రోడ్డులో ఆందోళన చేపట్టారు. సీపీఎం మండల కార్యదర్శి రమణయ్య మాట్లాడుతూ డప్పు కళాకారులకు గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని, రూ.7 వేల పింఛన్ అందించాలని కోరారు. అలాగే 3 సెంట్ల ఇంటి స్థలంతోపాటు రూ.5లక్షలతో ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. నేతలు బాలగురవయ్య, రమణయ్య పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నేతకు పితృవియోగం



వాసు (ఫైల్)

వరదయ్యపాళెం: మండలంలోని చిన్న పాండూరుకు చెందిన వైఎస్సార్‌సీపీ సత్యవేడు నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు దేవళ్ల మహేంద్ర తండ్రి వాసు సోమవారం సాయంత్రం కన్నుమూశారు. విషయం తెలుసుకున్న పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్, రాష్ట్ర కార్యదర్శి బీరేంద్ర వర్మ ఫోన్‌లో మహేంద్రను పరామర్శించారు. పార్టీ జిల్లా అధికార ప్రతినిధి చిన్నా, నేతలు చిలమత్తూరు భాస్కర్ రెడ్డి, వినోద్ యాదవ్, దుద్దు వేణు, మాధవయ్య తదితరులు మహేంద్ర తండ్రి భౌతికకాయానికి నివాళులర్పించారు.

కరపత్రాల ఆవిష్కరణ

బుచ్చినాయుడుకండ్రిగ: సీపీఐ జిల్లా స్థాయి రాజకీయ శిక్షణ తరగతుల కరపత్రాలను సోమవారం బీఎన్‌కండ్రిగలో ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామానాయుడు ఆవిష్కరించారు. వరదయ్యపాళెంలో అక్టోబర్ 5 వ తేదీ నుంచి 10 వరకు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు చిన్నిరాజ్, మండల కార్యదర్శి కత్తి ధర్మయ్య పాల్గొన్నారు.

చేనేత కార్మికుల ఉపాధికి చర్యలు

సత్యవేడు: చేనేత కార్మికులకు నిరంతరం ఉపాధి కల్పించడానికి చర్యలు చేపట్టినట్లు జౌళిశాఖ జిల్లా అధికారి ఆర్ రమేష్ తెలిపారు. సాక్షి పత్రికలో లుంగీ కార్మికుల బతుకు దుర్భరం అన్న శీర్షికతో సోమవారం ప్రచురితమైన కథనంపై ఆయన స్పందించారు. చేనేత కార్మికులకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నట్లు వెల్లడించారు.

జాతీయ స్థాయి కరాటే పోటీల్లో విద్యార్థి ప్రతిభ



విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

శ్రీకాళహస్తి: జాతీయ స్థాయి కరాటే ఛాంపియన్ షిప్–2025 పోటీల్లో శ్రీకాళహస్తికి చెందిన విజయవాణి ఈ టెక్నో, ఒలింపియాడ్ స్కూల్ విద్యార్థి చంద్రమౌళి ప్రతిభ చూపాడు. చెన్నైలో జరిగిన పోటీల్లో రెండు పతకాలు సాధించాడు. విద్యార్థిని సోమవారం పాఠశాల ప్రతినిధులు చంద్రశేఖర్‌రెడ్డి, హెచ్ఎం శ్యామలారెడ్డి అభినందించారు.

తూతూమంత్రంగా వైద్య శిబిరం

తొట్టంబేడు: మండలంలోని శివనాథపాళెంలో సోమవారం తూతూమంత్రంగా 104 వాహనం ద్వారా వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు సమ్మెలో ఉండడంతో ఏఎన్ఎంలు రోగులను పరీక్షించి మందులు అందజేశారు. దీనిపై స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో రెండు 104 వాహనాలు ఉండగా ఒక దానికి మాత్రమే డ్రైవర్ ఉన్నాడని చెబుతున్నారు.

అమరలో వరల్డ్ హార్ట్ డే

రేణిగుంట: మండలంలోని కరకంబాడి సమీపంలో ఉన్న అమర హాస్పిటల్‌లో సోమవారం వరల్డ్ హార్ట్ డే, డయాబెటిక్ రివైసల్ కార్యక్రమాలు నిర్వహించారు. అమర హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ గొరిసేని ప్రసాద్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ గొరిసేని రమాదేవి కార్యక్రమాన్ని ప్రారంభించారు. డాక్టర్లు వెంకటశివకృష్ణ, నాగరాజు, వెంకటేష్, నౌషాద్, శివరామ కృష్ణ, రమ్య సాయి గుండె ఆరోగ్యంపై ప్రజలకు అవగాహన కల్పించారు. చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ భాగ్యలక్ష్మి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రబీకి రైతన్నలు సిద్ధం

- జోరుగా నారుమడులు సిద్ధం
- వరినాట్లు వేసేందుకు రైతులు కసరత్తు
- కూలీలతో కళకళలాడుతున్న వ్యవసాయ క్షేత్రాలు



సీఎల్ఎన్‌పల్లిలో నారుమడులు సిద్ధం చేసిన రైతులు



మరదవాడలో అడుసు మడక దున్నుతున్న ట్రాక్టర్

వరదయ్యపాళెం: సత్యవేడు వ్యవసాయశాఖ సబ్ డివిజన్ పరిధిలో వరినాట్లు వేసేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. అక్టోబర్ 15 నుంచి ప్రారంభమైన రబీ సీజన్‌కు నాట్లు వేసే విధంగా వరినారు మడులను సిద్ధం చేసుకుంటున్నారు. గత రెండు వారాల నుంచి నారుమడులను సాగు చేసేందుకు ఓవైపు విత్తనాలు కొనుగోలు, దుక్కిదున్నకాల్లో రైతులు బిజీగా ఉన్నారు. సత్యవేడు సబ్ డివిజన్ పరిధిలోని పిచ్చాటూరు, నాగలాపురం, వరదయ్యపాళెం, సత్యవేడు మండలాల్లో 14వేల హెక్టార్లలో ప్రస్తుత రబీ సీజన్‌కు వరినాట్లు వేయనున్నారు. అందుకు సంబంధించి రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమై నాట్లు వేసేందుకు పొలాలను చక్కబెట్టుకుంటున్నారు. మరికొన్ని చోట్ల ముందస్తుగానే వరినాట్లు వేస్తున్నారు.

ఊరటనిచ్చిన వర్షాలు

తరచూ ఇటీవల కురుస్తున్న వర్షాలకు, తెలుగుగంగ కాలువలో నీరు ప్రవహిస్తుండడంతో వాగులు, వంకలు, చెరువులకు జలకళ సంతరించుకుంది. ఆ మేరకు సాగునీటి చెరువులు నీటితో కళకళలాడుతున్నాయి. దీనికి తోడు తెలుగుగంగ కాలువలో సైతం నీరు ప్రవహిస్తుండడంతో ఉపకాలువల ద్వారా చెరువులకు గంగనీరు చేరుతోంది.

వరి పంట సాగులో రకాలు

ప్రస్తుత రబీ సీజన్‌కు బీపీటీలు, ఎంటీయూ 1271, ఎంటీయూ1224, కేఎన్ఎం 1638,1010, పొన్మణి, బుడ్డలు, ఆర్ఎన్ఆర్‌లు ఎక్కువ మోతాదులో రైతులు సాగు చేసేందుకు వరినార్లు కూడా సిద్ధం చేసుకున్నారు.

వ్యవసాయ క్షేత్రాల్లో కళకళలాడుతున్న కూలీలు

వ్యవసాయ సీజన్ ప్రారంభం కావడంతో దుక్కి దున్నకాలు, నారు సేకరణ, వరినాట్లు వేసేందుకు అటు పురుషులు, ఇటు స్త్రీలతో వ్యవసాయ క్షేత్రాలు కళకళలాడుతున్నాయి. ప్రధానంగా పలు ప్రాంతాల నుంచి వలస వచ్చిన కూలీలతోనే పనులు చేపడుతున్నారు. స్థానికంగా నియోజకవర్గ పరిధిలో అటు శ్రీసిటీ, ఇటు ఏపీఐఐసీ పరిధిలో అనేక పరిశ్రమలు రావడంతో ఎక్కువ శాతం స్థానికులు పరిశ్రమలకు వెళ్తున్నారు. దీంతో వ్యవసాయ పనులకు స్థానికంగా కూలీల కొరత ఏర్పడింది. దీంతో శ్రీకాకుళం, పశ్చిమబెంగాల్, గుంటూరు ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన వలస కూలీలతో వ్యవసాయ పనులు చేపడుతున్నారు. ఎకరాకు రూ.6వేలు చొప్పున అన్ని పనులతో వరినాట్లు వేస్తున్నట్లు కూలీలు చెబుతున్నారు. దీంతో పనులు సైతం జోరుగా సాగుతున్నట్లు రైతులు చెబుతున్నారు.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణపై నేడు నిరసన

బుచ్చినాయుడుకండ్రిగ: మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ మంగళవారం తిరుపతి బస్టాండ్ సమీపంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసనకు దిగనున్నట్లు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి ఉగ్గుమూడి గురునాథం తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ కార్యక్రమానికి పెద్దసంఖ్యలో నేతలు, కార్యకర్తలు హాజరుకావాలని పిలుపునిచ్చారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



గర్భిణులకు సీమంతం చేస్తున్న అంగన్‌వాడీలు

ఏర్పేడు: పౌష్టికాహారం తీసుకోవడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రత్నమ్మ తెలిపారు. పంగూరు సచివాలయం, అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం రాష్ట్రీయ పోషణ మాసం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పౌష్టికాహార లోపం వల్ల మహిళల్లో రక్తహీనత కలుగుతుందన్నారు. విటమిన్లు, ప్రోటీన్లు అధికంగా ఉండే ఆహార పదార్థాలను తీసుకుంటే రక్త హీనతను దూరం చేయవచ్చన్నారు. అనంతరం గర్భిణులకు సామూహిక సీమంతం చేశారు. కార్యక్రమంలో ప్రగతి సంస్థ మండల కోఆర్డినేటర్ శిరీష పాల్గొన్నారు.

నిరుపేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలి



తహసీల్దారుకి వినతిపత్రం ఇస్తున్న సీపీఐ నేతలు

తొట్టంబేడు: శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని నిరుపేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలని సీపీఐ నాయకులు కోరారు. వారు సోమవారం శ్రీకాళహస్తి, తొట్టంబేడు తహసీల్దార్ కార్యాలయాల వద్ద నిరసన తెలిపారు. సీపీఐ నాయకులు మించల శివకుమార్, రుద్రపాకు శ్రీనివాసులు మాట్లాడుతూ శ్రీకాళహస్తి మండలం భగత్‌సింగ్ కాలనీ, అమ్మపాలెం, కొత్తపాలెం, మిట్ట తొండమనాడు, పుల్లారెడ్డి కండిగ, తొట్టంబేడు మండలం ఎల్ఐసీ కాలనీ, ఈదులగుంట, తొట్టంబేడు గ్రామాల్లో అనేక మంది పేదలు వున్నారని తెలిపారు. వారికి ఇంటి స్థలం, పక్కా గృహాలు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం తహసీల్దార్లు జనార్దన్ రాజు, భారతికి వినతి పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో రాజయ్య, గోపాల్, ధనమ్మ, సుబ్బమ్మ, ధనలక్ష్మి, అమరావతి, పరుశురామయ్య, మల్లేశ్వరి, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగుల నిరసన



ఆర్డీవో కార్యాలయం వద్ద సచివాలయ ఉద్యోగులు

శ్రీకాళహస్తి: తమకు అప్పగించిన వలంటీర్ విధులను వెంటనే తప్పించాలని సచివాలయ ఉద్యోగులు డిమాండ్ చేశారు. వారు సోమవారం నిరసన తెలిపారు. అనంతరం ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ సర్వేల పేరుతో తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలిపారు. ముఖ్యంగా గతంలో గ్రామ వలంటీర్లు చేస్తున్న పనులను తమకు అప్పగించారని, వాటిని తప్పించాలని కోరారు. ప్రొబేషన్ 9 నెలల బకాయిలను విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. కచ్చితమైన జాబ్ చార్ట్ ప్రకటించాలని తెలిపారు.

మృతునికి నివాళి



మునిరామయ్యకు నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి మండలం ఎగువవీధి పంచాయతీకి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు మునిరామయ్య సోమవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి అక్కడికి చేరుకుని మునిరామయ్య మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ శ్రీకాళహస్తి మండల అధ్యక్షుడు చెవిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, నారాయణ, మహేష్, కోటేశ్వరరావు, గున్నయ్య, ప్రతాప్, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర యాజమాన్యంతో అధిక దిగుబడి

బుచ్చినాయుడుకండ్రిగ: సేంద్రియ సాగులో సమగ్ర యాజమాన్య పద్ధతులను పాటిస్తే అధిక దిగుబడి సాధించవచ్చని ఏఓ షణ్ముగం తెలిపారు. సోమవారం మండలంలోని వీఎస్‌పురంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయశాఖ అధికారుల సూచనల మేరకు పంటల సాగు చేపట్టాలని కోరారు. భూసార పరీక్షలు, విత్తనశుద్ధి చేయించుకోవాలని స్పష్టం చేశారు. వరి సాగు చేపట్టిన రైతులకు పలు సూచనలు చేశారు.

పౌరహక్కులపై అవగాహన

రేణిగుంట: పౌరహక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. మండలంలోని కష్టాపురం యానాది కాలనీలో సోమవారం పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ ముద్దు రాయల్, వీఆర్వో సాయి తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ తగింపుపై ర్యాలీ

బుచ్చినాయుడుకండ్రిగ: జీఎస్టీ తగింపుపై ఎంపీడీఓ మోతీ ఆధ్వర్యంలో సోమవారం బీఎన్ కండ్రిగలో ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ పలు వస్తువులపై కేంద్రప్రభుత్వం పన్ను తగ్గించిందని వెల్లడించారు. ఈ మేరకు దుకాణాల వద్దకు వెళ్లి కొనుగోలు దారులకు తగ్గిన జీఎస్టీపై అవగాహన కల్పించారు. పంచాయతీ కార్యదర్శి పెంచలయ్య పాల్గొన్నారు.

అధికారుల పనితీరుపై అసంతృప్తి

కేవీబీపురం: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మునిలక్ష్మి అధ్యక్షతన సోమవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం మాట్లాడుతూ అధికారుల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు పూర్తిస్థాయిలో హాజరుకాకపోవడంపై మండిపడ్డారు. వెంటనే వారికి నోటీసులు పంపించి, వివరణ తీసుకోవాలని ఆదేశించారు. మండలంలోని 1,200 డ్వాక్రా సంఘాలకు రూ.2కోట్లను రుణాల కోసం మంజూరు చేయించామని వెల్లడించారు. తీసుకున్న రుణాలను సక్రమంగా చెల్లిస్తే, మండలానికి రూ.10కోట్లు మంజూరు చేయిస్తామని స్పష్టం చేశారు. అనంతరం స్త్రీనిధి మెగా చెక్కును లబ్ధిదారులకు అందించారు.

కరకంబాడి చెరువు పరిశీలన

సాక్షి ఎఫెక్ట్..

రేణిగుంట: మండలంలోని కరకంబాడి చెరువు ముంపు ప్రాంతంలో ఏర్పాటుచేసిన లేఅవుట్‌ను సోమవారం రెవెన్యూ సిబ్బంది పరిశీలించారు. లేఅవుట్ ఏర్పాటుచేయడంపై ఆదివారం సాక్షి దినపత్రికలో భూతాల పాగా అన్న శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి స్పందించారు. ఆర్ఐ జయకృష్ణ, సర్వేయర్లు, వీఆర్వోలను పంపించి సర్వే చేయించారు. నివేదికలను ఉన్నతాధికారులకు నివేదిస్తామని తెలిపారు.

ఎంపీ మిథున్‌రెడ్డికి బెయిల్‌పై హర్షం



నారాయణవనంలో స్వీట్లు పంచుతున్న నేతలు

బుచ్చినాయుడుకండ్రిగ: రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిరి బెయిల్ మంజూరు కావడంపై వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మణినాయుడు ఆధ్వర్యంలో సోమవారం పార్టీ నేతలు, కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు. మణినాయుడు మాట్లాడుతూ ఓటమి ఎరుగని, అవినీతి మచ్చలేని మిథున్‌రెడ్డిని అక్రమంగా అరెస్టు చేశారని ఆరోపించారు. రాజకీయంగా పెద్దిరెడ్డి కుటుంబాన్ని ఎదుర్కొనే దమ్ము, ధైర్యం లేక తప్పుడు కేసులతో వేధిస్తున్నారని మండిపడ్డారు.

నారాయణవనంలో..

నారాయణవనం: రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డికి బెయిల్ వచ్చిన నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ నేతలు సంబరాలు జరుపుకున్నారు. పార్టీ మండల కన్వీనర్ సౌరకాయలు, రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యదర్శి అన్నాదొరై, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి రాకేష్ కిరణ్, సర్పంచ్‌లు నాగూరు, సుబ్రమణ్యం రెడ్డి, మురళి, ఎంపీటీసీ సభ్యుడు రవి, నేతలు గురుస్వామి, దొరైరాజ్, హేమచంద్రారెడ్డి, తిరువేంగడం, పీజీ బాబు, గోవిందస్వామి, మంజునాథ్, యువరాజ్, అశోక్ పాల్గొన్నారు.



హర్షం వ్యక్తం చేస్తున్న నేతలు

కేవీబీపురంలో..

కేవీబీపురం: ఎంపీ మిథున్‌రెడ్డికి బెయిల్ మంజూరు కావడంపై వైఎస్సార్‌సీపీ నేతలు హర్షం వ్యక్తం చేశారు. సోమవారం కేవీబీపురంలోని వైఎస్సార్ విగ్రహం వద్ద బాణసంచా పేల్చి సంబరాలు జరుపుకున్నారు. నేతలు దశరథరామిరెడ్డి, డేవిడ్, అయ్యప్ప, గిరి, హరిబాబు, గోపి, రమేష్, ఆరువేల్, అరుణ్ పాల్గొన్నారు.

కన్యకా పరమేశ్వరి సేవలో మాజీ ఎమ్మెల్యే



బియ్యపు మధుసూదన్‌రెడ్డిని సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని బహదూరుపేటలో వెలసిన కన్యకా పరమేశ్వరి అమ్మవారిని సోమవారం మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, ముక్కంటి ఆలయ పాలక మండలి మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు దర్శించుకున్నారు. వారికి ఆలయ కమిటీ సభ్యులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారిని సత్కరించారు. చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు పురుషోత్తం, దసరా కమిటీ చైర్మన్ మునగాల రాకేష్, సభ్యులు కొత్త సురేష్‌బాబు, మధు, సుబ్బారావు, నాగేశ్వరరావు, మోహన్, బాబు, పులి రామచంద్రయ్య, సురేష్, మున్నా రాయల్, బుల్లెట్ జయశ్యామ్, జీవీకే రెడ్డి, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

జ్ఞానప్రదాయని మాతా సరస్వతి

శ్రీకాళహస్తి: జ్ఞానప్రదాయని మాతా సరస్వతి పాహిమాం అని భక్తులు అమ్మవార్లను మొక్కారు. దసరా ఉత్సవాల్లో భాగంగా సోమవారం అమ్మవార్లు వివిధ రూపాల్లో భక్తులను అనుగ్రహించారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలోని జ్ఞానప్రసూనాంబ అమ్మవారు బండాసుర వధ అలంకారంలో దర్శనమిచ్చారు. అలాగే బొమ్మల కొలువులో అమ్మవారిని మంగళగౌరిగా అలంకరించారు. కనకదుర్గమ్మ సరస్వతిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. బజారువీధిలోని కన్యకా పరమేశ్వరి అమ్మవారు సర్వతిదేవి, బంగారమ్మ, పొనగల్ గంగమ్మ, ముత్యాలమ్మ, భాస్కరపేట చాముండేశ్వరి, పట్టణంలోని తెట్టు ప్రాంతంలోని నల్లగంగమ్మ, పొనగల్ పొన్నాలమ్మ, ముత్యాలమ్మ, తెట్టువద్ద నల్లగంగమ్మ సరస్వతిదేవిగా, బహదూరుపేట కన్యకాపరమేశ్వరి అమ్మవారు జ్ఞానసరస్వతిగా భక్తులను అనుగ్రహించారు. విశ్వబ్రాహ్మణవీధిలోని గంగమ్మ, ఏడుగంగల అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు.



శ్రీకాళహస్తి: ప్రత్యేకాలంకారంలో జ్ఞానప్రసూనాంబ, కనకాచలం కనకదుర్గమ్మ, ఏడుగంగమ్మల అమ్మవార్లు

విశిష్టాలంకరణలో అమ్మవారు

నారాయణవనం: సముదాయంలోని అవనాక్షమ్మ ఆలయంలో అమ్మవారు ధనలక్ష్మిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఏఈఓ రవి, సూపరింటెండెంట్ ధర్మయ్య, ఆలయ అధికారి నాగరాజు ఏర్పాట్లను పర్యవేక్షించారు. అలాగే కైలాసనాధకోనలోని కామాక్షాంబిక సమేత కైలాసనాధస్వామి ఆలయంలో అమ్మవారు దుర్గాదేవిగా, తిరువట్యంలో మూలస్థాన ఎల్లమ్మ ధనలక్ష్మిగా, స్థానిక ధర్మరాజస్వామి ఆలయంలో అమ్మవారు మధుర మీనాక్షిగా భక్తులను కటాక్షించారు.

అమ్మవారికి విశేష పూజలు

ఏర్పేడు: మండలంలోని గుడిమల్లం పరశురామేశ్వరాలయంలో శ్రీ ఆనందవల్లి అమ్మవారు సరస్వతి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈవో రామచంద్రారెడ్డి, మాజీ చైర్మన్ బత్తల గిరినాయుడు ఆధ్వర్యంలో ఉభయదారులు అన్నదానం చేశారు. టీటీడీ పండితులు ఆకెళ్ల విభూషణశర్మ ప్రవచనాలు చెప్పారు. చిందేపల్లిలో పార్వతీ సమేత సిద్ధేశ్వరాలయంలో ఆలయ ధర్మకర్త గంగలపూడి గిరిధర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక హోమాలు చేశారు. కందాడలో కామాక్షి దేవి సమేత సదాశివేశ్వరాలయంలో అమ్మవారు విశేష పూజలందుకున్నారు.



జ్ఞానసరస్వతిగా కన్యకాపరమేశ్వరి, సరస్వతిదేవిగా నల్లగంగమ్మ



ఏర్పేడు: సరస్వతిదేవి అలంకరణలో గుడిమల్లం ఆనందవల్లీ దేవి, దుర్గాదేవిగా కామాక్షాంబిక, ధనలక్ష్మిగా అమ్మాయాక్షి, ఎల్లమ్మ, మదుర మీనాక్షిగా ద్రౌపదీదేవి